


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం, 29-09-2023 సంపుటి : 06 సంచిక : 29 పేజీలు : 8 వెల : రూ 3-00

## ఎంఎస్ స్వామినాథన్ మృతి పట్ల సీఎం జగన్ సంతాపం

తాడేపల్లి: హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ మృతిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ''వ్యవసాయ శాస్త్రవేత్త అయిన స్వామినాథన్ గ్రామీణ రూపురేఖలను సమూలంగా మార్చారు.పద్మవిభూషణ్, మెగసెసె అవార్డు గ్రహీత ఎంఎస్ స్వామినాథన్



వ్యవసాయ రంగానికి ఆయన చేసిన కృషి అభినందనీయం. స్వామినాథన్ కృషి దేశాన్ని ఆహారో త్పత్తిలో బలోపేతం చేసి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సుసంపన్నం చేసింది" అని సీఎం జగన్ ట్వీట్? చేశారు.భారత హరిత విప్లవ పితామహుడిగా ప్రఖ్యాతిగాంచిన ఎమ్.ఎస్ స్వామినాథన్(98) కన్నుమూశారు. గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో పోరాడుతున్న ఆయన.. చెన్నైలో తుదిశ్వాస విడిచారు. ఆహారాభివృద్ధిలో భారత్ స్వయం సమృద్ధి సాధించేందుకు స్వామినాథన్ ఎనలేని సేవ చేశారు.దేశంలో ఆహార కొరతను ఎదుర్కొనడానికి మేలైన వరి వంగడాలను స్వామినాథన్ సృష్టించారు.1960 నుంచి 1970ల్లో స్వామినాథన్ చేసిన కృషి భారత వ్యవసాయ రంగాన్ని విప్లవాత్మకంగా మార్చింది. కరువు కోరల్లో చిక్కుకున్న భారత వ్యవసాయ రంగాన్ని స్వయం సమృద్ధివైపుకు మరలించారు. అధిక దిగుబడినిచ్చే గోధుమ, వరి వంగడాలను సృష్టించి వ్యవసాయ ఉత్పాదకతను అమాంతం పెంచారు.

# యువగళం పాదయాత్ర వాయిదా



అమరావతి,సెప్టెంబర్28 : నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర కొనసాగింపు వాయిదా పడింది. స్కిల్ డెవలప్ మెంట్ కేసు వల్ల పాదయాత్ర తేదీని మార్చిన ట్లుగా టీడీపీ వర్గాలు చెబుతున్నా యి. అక్టోబర్ 3న సుప్రీంకోర్టులో స్కిల్ డెవలప్ మెంట్ కేసు విచారణ ఉన్నందున యువగళం పాదయాత్ర కొనసాగింపునకు ఆటంకం ఏర్పడింది. ఈ మేరకు యువగళం పాదయాత్ర వాయిదా వేస్తున్నట్లు టీడీపీ అధికారిక ప్రకటన చేసింది. త్వరలోనే నాయకులతో చర్చించి యువగళం పునఃప్రారంభ తేదీని ప్రకటించాలని అనుకుంటున్నారు. ముందుగా అనుకున్న ప్రకారం.. యువగళం పాదయాత్ర శుక్రవారం రాత్రి 8 గంటల నుంచి తిరిగి ప్రారంభం కావాల్సి ఉంది. చంద్రబా బు అరెస్టు, తర్వాత జరిగిన పరిణామాల వల్ల సెప్టెంబరు 9న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజోలు నియోజకవర్గంలో యువగళం పాదయాత్రని నిలిపివేశారు. దాదాపు 20 రోజుల తర్వాత సెప్టెంబరు 29న రాత్రి 8.15 గంటలకు పాదయాత్ర మళ్లీ ప్రారంభించాలని నిర్ణయిం చారు.

**చంద్రబాబు కేసులతో ఢిల్లీలోనే లోకేశ్ మకాం న్యాయవాదులతో సంప్రదింపులతో బిజీ పార్టీ నేతల విజ్ఞప్తి మేరకు వాయిదా...త్వరలోనే తేదీ ఖరారు**

కానీ, అక్టోబర్ 3న స్కిల్ డెవలప్‌మెంట్ కేసు పిటిషన్ సుప్రీంకోర్టులో వాదనలు ఉన్నందున యువగళం పాదయాత్ర పునఃప్రారంభ తేదీని వాయిదా వేసుకోవాలని పార్టీ ముఖ్య నేతలే లోకేశ్‌ని కోరారు. ప్రస్తుతం లోకేశ్ ఢిల్లీలో ఉండి కేసు విషయంలో న్యాయనిపుణులను సంప్రదిస్తున్నారు. పాదయాత్రలో ఉంటే న్యాయవాదులతో సంప్రదింపులు, ఇతర కార్యక్రమాల పర్యవేక్షణ ఇబ్బంది అవుతుందని లోకేశ్ కు పార్టీ నేతలే చెప్పారు. వారి సలహాలను స్వీకరించిన లోకేశ్.. యువగళం పాదయాత్ర పునఃప్రారంభ తేదీని వాయిదా వేసుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. త్వరలోనే నాయకులతో చర్చించి యువగళం పాదయాత్ర తేదీలను ఖరారు చేయనున్నారు.మరోవైపు కక్ష సాధింపుతో అనేక కేసులు తెరపైకి తెచ్చి టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబును ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని టీడీపీ నేతలు కన్నెర్రజేస్తున్నారు. ఈ సమయంలో లోకేష్ ఢిల్లీలో ప్రతినిత్యం అడ్వకేట్లతో సంప్రదింపులు చేయడం చాలా అవసరమని టీడీపీ ముఖ్యనేతలు అభిప్రాయపడ్డారు. పాదయాత్రలో ఉంటే న్యాయవాదుల తో సంప్రదింపులు, ఇతర కార్యక్రమాల పర్యవేక్షణ కష్టం అవుతుందని లోకేష్‌తో ముఖ్యనేతలు చెప్పగా.. యువనేత పాదయాత్రను వాయిదా వేసుకున్నారు. ఇదిలా ఉంటే.. లోకేష్‌ను కూడా అక్రమంగా అరెస్టు చేస్తే.. అదే ముహూర్తానికి పాదయాత్ర మొదలుపెట్టేందుకు ఆయ న సతీమణి నారా బ్రాహ్మణి సిద్ధమయ్యారు. ఆమెకు ఇప్పటికే అన్ని విషయాలను కుటుంబసభ్యులు వివరించినట్లు తెలుస్తోంది. బ్రాహ్మణి పాదయాత్ర చేస్తే ప్రజల్లో సానుభూతి ఎక్కువగా వస్తుందని టీడీపీ నేతలు అంచనా వేస్తున్నారు. ఇక బ్రాహ్మణి పాదయాత్ర అంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో అధికారపార్టీ నేతల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే చంద్రబాబు అరెస్టుతో ప్రజల్లో టీడీపీ పట్ల సానుభూతి వస్తుందని వైసీపీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఊహించినదానికంటే ఎక్కువగా నిరసనలు, సానుభూతి ఉందనేది అధికార పార్టీ ఎమ్మెల్యేల మాట. చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను అక్టోబరు3న విచారించాలని సుప్రీం కోర్టు నిర్ణయించింది. తనపై నమోదైన కేసును కొట్టివేయడానికి నిరాకరిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ చంద్రబాబు సుప్రీం కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

## 29న నంద్యాల ఎంపీడీవో కార్యాలయంలో జగనన్నకు చెబుదాం

### – స్పందన కార్యక్రమం జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్



నంద్యాల, సెప్టెంబర్ 28:– విభారె న్యూస్ వారంలో ప్రతి బుధవారం, శుక్రవారం మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమంలో భాగంగా ఈనెల 29వ తేదీ నంద్యాల మండల కేంద్రంలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

# చంద్రబాబు అరెస్టుపై వైసిపిలో వ్యతిరేకత

**అయినా పట్టించుకోని సిఎం జగన్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వ్యాఖ్యలు**



నెల్లూరు,సెప్టెంబర్28(ఆర్ఎన్ఎ): చంద్రబాబు అక్రమ అరెస్ట్ ను వైసీపీలో మెజార్టీ వర్గం వ్యతిరేకిస్తోందని ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరిన కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. రాజకీయంగా నష్టపోతామని వైసీపీ నేతలే అంటున్నారని... వైసీపీ సానుభూతిపరుడైన ఓ పారిశ్రామికవేత్త ప్రశాంత్ కిషోర్ కు ఫోన్ చేసి చంద్రబాబు అరెస్ట్ పై ఆరా తీశారన్నారు. వైసీపీకి జరగాల్సిన నష్టం జరిగిపోయిందని ప్రశాంత్ కిషోర్ చెప్పారని.. లోకేష్‌ని అరెస్ట్ చేస్తే వైసీపీకి మరింత నష్టమని ప్రశాంత్ కిషోర్ అన్నారని కోటంరెడ్డి తెలిపారు. పవన్ కళ్యాణ్‌పై కేసులు పెట్టవద్దని ప్రశాంత్ కిషోర్ చెప్పారని కోటంరెడ్డి ప్రకటించారు. నెల్లూరులో మీడియాతో మాట్లాడుతూ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబును అరెస్ట్ చేయడం సరైన పద్ధతి కాదని.. బాబును అరెస్ట్ చేయాలనే పనికిమాలిన సలహాలు ప్రశాంత్ కిషోర్ ఇవ్వరని కోటంరెడ్డి స్పష్టం చేశారు. వైసీపీలో పరిస్థితి బాగోలేదు ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అన్నీ చేసినా గెలవలేకపోయిందని గుర్తు చేశారు. అభివృద్ధి లేదు.. ఉద్యోగాలు లేవు, వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఓ చేత్తో ఇచ్చి మరో చేత్తో తీసుకుంటున్నారన్న అభిప్రాయం ప్రజల్లో ఉందని.. జగన్ ప్రశాంత్ కిషోర్ మాట వినలేదని ఆ పారిశ్రామికవేత్త తనతో చెప్పారన్నారు. చంద్రబాబుది అక్రమ అరెస్ట్ అని అందరికీ అర్థమవుతోందన్నారు. చంద్రబాబును సీఐడీ పోలీసులు అరెస్ట్ చేసినప్పటి నుండి ఆయన యాక్టివ్ గా ఉన్నారు. నెల్లూరులోని ఇతర టీడీపీ నేతల కన్నా ఎక్కువగా ఆందోళనలు చేస్తున్నారు. మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు అరెస్ట్ వైసీపీకి ఎంత నష్టం కలిగిస్తుందో వివరిస్తున్నారు. సోషల్ మీడియాలో ఆయన కామెంట్లు వైరల్ అవుతున్నాయి. ఆయన వైసీపీ నుంచి రావడంతో .. చంద్రబాబు అరెస్టుపై ప్రధానంగా వైసీపీలో ఏమనుకుంటు న్నారో విశ్లేషిస్తున్నారు. రెండు రోజుల కిందట ఆయన రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కింద ఏర్పాటు చేసిన సెంటర్ల సందర్శనకు, బహిరంగ చర్చకు వైసీపీ సిద్ధమా? అని సవాల్ కూడా చేశారు. మధ్యవర్తులుగా మేధావులను జయప్రకాష్ నారాయణ, జేడీ లక్ష్మినారాయణ తీసుకురావచ్చునని, లేదా వైసీపీకి నచ్చిన వారిని తేవచ్చునని అన్నారు. దీనికి తెలుగుదేశం పార్టీ సిద్ధంగా ఉందన్నారు. అన్ని స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సెంటర్లకు మీడియాతో సహా వస్తే అక్కడే లెక్కలు తెలుస్తామన్నారు. ఈ బహిరంగ చర్చకు సాక్షి పేపరు,టీవీ వచ్చినా పర్వాలేదని తమకుఅభ్యంతరం లేదని కోటంరెడ్డి స్పష్టం చేశారు.స్కిల్‌డెవలప్‌మెంట్34 పాలిటెక్నికల్,6ఇంజనీరింగ్ కాలేజీ లు, కీయ మోటార్స్‌లో స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్స్ ఏర్పాటు చేశారు. 2019 లో దేశంలోనే స్కిల్ డెవలప్ మెంట్‌లో ఏపీకి మెదటి స్థానం వచ్చింది.

## సమన్వయ కమిటీ చైర్మన్‌గా నాదెండ్ల

### జనసేన సమావేశంలో పవన్ కళ్యాణ్ ప్రకటన

అమరావతి,సెప్టెంబర్28( : జనసేన, తెలుగుదేశం సమన్వయ కమిటీ ఛైర్మన్‌గా నాదెండ్ల మనోహర్‌ను పవన్ కళ్యాణ్ నియమించారు. వచ్చే ఎన్నికలకు జనసేన – టీడీపీ కార్యకర్తలు కలిసి పని చేసేలా ఈ సమావేశంలో నాదెండ్ల మనోహర్ జనసేన నాయకులకు దిశానిర్దేశం చేశారు. మంగళగిరి జనసేన కార్యాలయ ంలో నాదెండ్ల మనోహం్(ఔజీటునిటెజీ ఓజీనినీరజీస) అధ్యక్షతన గురువారం నాడు సమావేశం జరిగింది. ఈ భేటీ కొద్దిసేపటి క్రితమే ముగిసింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు, నగర అధ్యక్షులు హాజరయ్యారు. పవన్ కళ్యాణ్ జనసేన – టీడీపీ పొత్తు అంశంపై స్పష్టమైన ప్రకటన చేసిన క్రమంలో క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణ, వారాహి విజయ యాత్రపై చర్చించారు.



## రైతుల గుండెల్లో స్వామినాథన్ చిరస్థాయిగా నిలిచిపోతారు : సీఎం కేసీఆర్

హైదరాబాద్ : భారత హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ మృతి పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. దేశ వ్యవసాయ రంగం పెద్ద దిక్కును కోల్పోయిందని కేసీఆర్ అన్నారు. వ్యవసాయ రంగంలో స్వామినాథన్ వినూత్న పద్ధతులు చేర్చారు. స్వామినాథన్ కృషి వల్లే ఆహారాభివృద్ధిలో భారత్ స్వయం సమృద్ధి సాధించింది. రైతుల గుండెల్లో స్వామినాథన్ చిరస్థాయిగా నిలిచిపోతారని కేసీఆర్ పేర్కొన్నారు.భారత హరిత విప్లవ పితామహుడు, ప్రపంచ ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత, పద్మ విభూషణ్ శ్రీ ఎం.ఎస్ స్వామినాథన్ మరణం పట్ల సీఎం శ్రీ కేసీఆర్ తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. వారి మరణంతో దేశ వ్యవసాయరంగం పెద్దదిక్కును కోల్పోయిందని ఆవేదన వ్యక్తంచేశారుఛభారతీయ హరిత



విప్లవానికి జాతిపితగా కీర్తించబడే ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ గురువారం మధ్యాహ్నం కన్నుమూసిన సంగతి తెలిసిందే. భారతీయ వ్యవసాయ రంగంలో ఆయన అనేక విప్లవాత్మక మార్పులను సృష్టించారు. అత్యధిక స్థాయిలో దిగుబడిని ఇచ్చే అనేక వరి వంగడాలను ఆయన డెవలప్ చేశారు. తక్కువ ఆదాయం ఉన్న రైతులకు .. దిగుబడిని పెంచే అనేక పద్ధతులను ఆయన నేర్పారు.1987లో స్వామినాథన్‌కు వరల్డ్ ఫుడ్ ప్రైజ్ అవార్డు దక్కింది. ఆ తర్వాత ఆయన చెన్నైలో ఎంఎస్ స్వామినాథన్ రీసర్చ్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. స్వామినాథన్ అనేక అంతర్జాతీయ అవార్డులను గెలుచుకున్నారు. 1971లో ఆయన రామన్ మెగస్సేసే అవార్డును సొంతం చేసుకున్నారు.

## గంగమ్మ ఒడికి చేరిన ఖైరతాబాద్ గణనాథుడు



హైదరాబాద్ : ఖైరతాబాద్ శ్రీ దశ మహా విద్యాగణపతి నిమజ్జనం కార్యక్రమం పూర్తయింది. నవరాత్రుల పాటు భక్తుల ప్రత్యేక పూజలందుకున్న గౌరీ తనయుడు గంగమ్మ ఒడికి చేరాడు. 63 అడుగుల ఎత్తు, 40 టన్నుల బరువున్న ఈ విగ్రహ నిమజ్జనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఖైరతాబాద్ గణనాథుడి నిమజ్జన ప్రక్రియకు ఇసుకెస్తే రాలనంత జనం వచ్చి.. బైబై వినాయకా అంటూ వీడ్కోలు పలికారు. మహాగణపతి శోభయాత్ర ఖైరతాబాద్ నుంచి టెలిఫోన్ భవన్ మీదుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర సచివాలయం ముందు నుంచి హుస్సేన్‌సాగర్ వరకు సాగింది. ఇక్కడ చివరిసారిగా నిర్వాహకులు మహాగణ పతికి పూజలు నిర్వహించారు. అనంతరం నాలుగో నంబర్ క్రేన్ ద్వారా మహాగణపతిని హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు. వినాయకు డిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం ఖైరతాబాద్‌లో శోభాయాత్ర ప్రారంభం కాగా.. మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగింది. మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో ఖైరతాబాద్ గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. నిమజ్జనం సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# సంపాదకీయం

గురువారం, 28-09-2023

## సమాంతర పాలనతో వ్యవస్థల భ్రష్టు !

వ్యవస్థలను భ్రష్టు పట్టించడం ద్వారా ఎన్నికల్లో ఎలా గెలవ వచ్చో పాలక పార్టీలు బాగా వంటబట్టించు కున్నాయి. అందుకు అనుగుణంగా రకరకాల విన్యాసాలు చేస్తున్నాయి. తమకు అనుకూలంగా కొత్త వ్యవస్థలను సృష్టిస్తున్నాయి. గతంలో టిడిపి అధికారంలో ఉండగా జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసింది. వాటి ద్వారానే కార్యక్రమాలను అమలు చేశారు. ఈ కమిటీలను విమర్శించిన వైసిపి అధికారంలోకి రాగానే వాటి స్థానంలో గ్రామ సచివాలయం అంటూ కొత్త వ్యవస్థను ఏర్పాటు చేసి, సెక్రటీరలను నియమిం చింది. ఈ రెండు పద్దతులు కూడా పంచాయితీ వ్యవస్థను మింగేశాయి. పంచాయితీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేశాయి. సమాంతర వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని గ్రామస్థాయిలో తమకు అనుకూలంగా వ్యవహారాలను నడుపుతూ వచ్చారు. దీంతో సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు ఉత్సవ విగ్రహాల్లాగా మారారు. తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు విఎవో, విఆర్ఎ వ్యవస్థలను తీసి అవతల పడేశారు. ఎన్టీఆర్ హయాంలో గ్రామీణ వ్యవస్థకు పట్టుకొమ్మగా ఉన్న పటేల్,పట్వారీ వ్యవస్థను రద్దు చేశారు. దానికి ప్రత్యామ్నాయం ఆలోచించకుండా నిర్ణయాలు తీసుకోవడంతో ఇప్పటికీ రెవెన్యూ వ్యవస్థను కోలుకోకుండా చేశారు. నిజానికి ఇదంతా మంచి చేశామని అనుకుంటున్నారు. దీనివెనక పెద్ద స్వార్థం దాగివుందన్నది నిజం. ఎందుకంటే గ్రామస్థాయిలో కార్యక్రమాలను సిఎం స్థాయిలో అమలు చేయాలన్న స్వార్థ లక్ష్యంతోనే సచివాలయ వ్యవస్థను తీసుకుని వచ్చారు. ఇది కాదనలేని నిజం. తాజాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు, నిర్వహణపైన, రాష్ట్ర రాజధాని అమరావతి విషయంలోనూ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కాగ్ చేసిన వ్యాఖ్యలు అక్షర సత్యాలు. పాలకుల తీరుతెన్నులను కాగ్ ఉ న్నదివున్నట్లుగా వెల్లడించింది. సామాన్యులకు ప్రభుత్వ సేవలను క్షేత్రస్థాయిలో అందించడంలో సచివాలయ వ్యవస్థ పాత్ర పోషిస్తున్నదని చెప్పుకుంటున్నా..రాజ్యాంగ స్ఫూర్తిని నీరుగార్చేలా ఉంది. 74వ రాజ్యాంగ సవరణ చట్టం పట్టణ స్థానిక సంస్థలకు రాజ్యాంగ హోదాను అందించింది. ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, పౌరులను భాగస్వామ్యం చేయడం, పౌరులకు పాలనను చేరువ చేయడం స్థానిక స్వపరి పాలన ప్రధాన లక్ష్యం. రాష్ట్రంలో ఎక్కడా వార్డు కమిటీలను ఏర్పాటు చేయనే లేదు. ఇక పౌరులను భాగస్వామ్యం చేసే పరిస్థితి అస్సలు లేదు. ఇవి రెండూ చేపట్టకుండా వార్డు స్థాయిలో సచివాలయాల వ్యవస్థ రూపుదిద్దుకోవడం స్థానిక స్వపరిపాలనకు ఉద్దేశించిన రాజ్యాంగ స్ఫూర్తిని నీరుగార్చడమే. వార్డు కమిటీలను ఏర్పాటు చేసి, ఆయా కమిటీలు, ఏరియా సభలతో వార్డు సచివాలయాలను అనుసంధానం చేస్తేనే స్వపరిపాలన సాధ్యమవుతుంది. 74వ రాజ్యాంగ సవరణ చట్టం, ఆంధ్రప్రదేశ్ పురపాలక చట్టాల్లోని నిబంధనలకు అనుగుణంగా పాలన నడవాల్సి ఉండగా సచివాలయ వ్యవస్థ దెబ్బతీస్తోంది. ప్రజాస్వామ్యం లో ప్రభుత్వాలు మారినా... ప్రజలకు సేవ చేసే విషయంలో పోటీపడి, ప్రజాధనానికి నష్టం కలగకుండా చేయాల్సిన బృహత్తర కర్తవ్యం పాలకులది. ఆ స్ఫూర్తిని ప్రభుత్వాలు మంటగలిపితే... కలిగే అనర్థాలకు సచివాలయ వ్యవస్థ అద్దం పడుతుంది. అప్పట్లో జన్మభూమి కమిటీలు నిర్వహించిన పాత్రనే ఇప్పుడు సచివాలయ వ్యవస్థ నిర్వహిస్తోంది. భారత రాజ్యాంగంలోని 12వ షెడ్యూల్‌లో పేర్కొన్న 18 విధులు నిర్వహించేందుకు పట్టణ, స్థానిక సంస్థలకు అధికారం ఇచ్చింది. వాటిలో 13 విధులను పూర్తిగాను, మూడు విధులను పాక్షికంగానూ నగర పాలక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఇక పురపాలక,నగర పంచాయతీల విషయానికి వస్తే ఏడు విధులను పూర్తిగాను, ఐదు విధులను పాక్షికంగానూ అప్పగించింది. వార్డు, గ్రామ సచివాలయాల వ్యవస్థను 2019 జులై నుంచి నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో రాష్ట్రప్రభుత్వం అమలు చేయడం ప్రారంభించింది. రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థలకు సకాలంలో ఎన్నికలు జరపడం లేదు. ఎక్కువ స్థానిక సంస్థలు ఎన్నికైన ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం లేకుండా రాష్ట్రప్రభుత్వ కనుసన్నల్లో... ప్రత్యేక అధికారుల పాలనలోనే మగ్గుతున్నాయి. నిజానికి పంచాయితీ వ్యవస్థను ఏర్పాటు చేసిందే... గ్రామాల ఆర్థికవ్యవస్థను అభివృద్ది చేయడం కోసం. దానిని నిర్వీర్యం చేసి,సొంతంగా..సమాంతర వ్యవస్థలను సృష్టించి ఓట్లవేట మొదలు పెట్టడం చూస్తున్నాం. వీరికి గ్రామాల అభివృద్ది లక్ష్యం అయివుంటే ఈ పాటికి కనీసం పాతికశాతం ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేవి. కానీ అలా జరగడం లేదు. అంటే సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలు కొత్త సమస్యలు ఎదుర్కొం టున్నారు. ప్రజల సమాచారం దుర్వినియోగం అవుతోందని, ఎవరికో దీనిని అప్పగిస్తున్నారని ఇటీవల జనసేనాని పవన్ కళ్యాణ్ ఆరోపించారు. దీనికి సమాధానం చెప్పకుండా విమర్శలకు దిగారు..అంటే తమ లక్ష్యానికి అడ్డుగా వస్తున్నారని వారు భావిస్తున్నారు. తాజాగా ఇప్పుడు కాగ్ ఇదే రకమైన అభిప్రాయం వ్యక్తం చేసింది. దీనికైనా సమాధానం చెప్పుకోవాలి. ఈ క్రమంలో పంచాయితీలకు రావాల్సిన నిధులను కేంద్రప్రభుత్వం మెడలు వంచి నిధులు రాబట్టలేకపోతున్నారు. ఇకపోతే 2019 నుంచి అమరావతికి బడ్జెట్ సహకారం లేకపోవడం, రూ.33,476 కోట్లు రుణంగా సమీకరిరచుకోవాల్సి ఉరడగా, రూ.8,540 కోట్లే సమీకరించడం, కాలపరిమితి లేకుండా ఉన్న 55 ప్యాకేజిల ఒప్పందాలపై అనిశ్చితి, వాటిని పూర్తి చేయడానికి అవసరమైన రూ.28,048 కోట్లపై స్పష్టత లేకపోవడం... ఇలా ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని కాగ్ ఎండగట్టింది. భూసమీకరణకు రూ.2,245 కోట్లు సిఆర్‌డిఎ వ్యయం చేయగా, ఆ భూమంతా నిరుపయోగంగా పడి వుంది. ప్రభుత్వ భూములను వదిలేసి ప్రైవేటు భూములనే రాజధానికి సేకరించడం, 70 శాతాన్ని భూసమీకరణ ద్వారా సేకరించాలని అప్పట్లో తీసుకున్న నిర్ణయాన్ని కాగ్ నివేదిక ఆక్షేపించింది. ఇలా వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నా..కాగ్ తప్పు పట్టినా పట్టించుకునే వ్యవస్థ ఉందా అన్నది అనుమానం. కేంద్రం కూడా ఇలాంటి తరహా వ్యవస్థలను చూసీచూడనట్లుగా ఉండడం దారుణం కాక మరోటి కాదు.

# తెలుగు సాహితీ దిగ్గజం గుఱ్ఱం జాషువా

**జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఎం సుధాకర్ బాబు.**



కర్నూలు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 విభారె న్యూస్.తెలుగు సాహితీ దిగ్గజం గుఱ్ఱం జాషువ అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎం సుధాకర్ బాబు అభిప్రాయపడ్డారు.గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గుర్రం జాషువా 128వ జయంతి సందర్భంగా కర్నూలు జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్ సి బజారన్న,డిసిసి సహాయ కార్యదర్శి ఈ లాజరస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుధాకర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వీరయ్య, లింగమ్మ దంపతులకు గుఱ్ఱం జాషువ 1895 సెప్టెంబర్ 28వ తేదీన గుంటూరు జిల్లా చాట్రగడ్డపాడు గ్రామంలో జన్మించారని, జాషువా తండ్రి పాస్టర్ గా పనిచేశాడని కుల వివక్ష కారణంగా తోటి విద్యార్థులతో అవమానాలు ఎదుర్కొన్నాడని, ఉపాధ్యాయుడిగా పని చేశాడని, రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ప్రచారకుడిగా పని చేశాడని, రేడియో కేంద్రంలో ప్రొడ్యూసర్ గా పని చేశారని,1964లో శాసనమండలిలో సభ్యత్వం పొందాడని జాషువా 36 గ్రంథాలు, ఎన్నో కవితా ఖండాలు రాశారని, కేంద్ర సాహితీ అకాడమీ పురస్కారం, కళా ప్రపూర్ణ, పద్మభూషణ్ పురస్కారాలు లభించాయని ఆయన తెలుగు భాషకు చేసిన సేవలు అమోఘమని జాషువా గారు 1971 జూలై 24వ తేదీన మరణించారని ఆయన మరణం కవితా లోకానికి తీరని లోటని తెలియజేశారు. ముందుగా పార్టీ నాయకులు కార్యకర్తలు గుఱ్ఱం జాషువా చిత్రపటమునకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సుధాకర్ బాబు గారు ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఆదోని ఇన్చార్జ్ దేవిశెట్టి ప్రకాష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్ సి హెచ్ బజారన్న, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కాసిం వలీ, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అహ్మద్ నూర్, మైనార్టీ సెల్ సిటీ అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్,మహిళా కాంగ్రెస్ సిటీ అధ్యక్షురాలు ఎస్ ప్రమీల,ఎస్సీ సెల్ సిటీ అధ్యక్షులు డబ్ల్యూ సత్యరాజు,డిసిసి కార్యదర్శులు రియాజ్, లజారస్, ఎజాస్ కాంగ్రెస్ జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఖాద్రి నాయకులు బి సుబ్రహ్మణ్యం శివానంద్ ఐఎన్టియుసి నాయకులు ఆశీర్వాదం ఆనందం జేమ్స్ మహిళా కాంగ్రెస్ నాయకులు కేవీ లక్ష్మి మద్దమ్మ అయ్యమ్మ కరుణమ్మ మొదలగు వారు పాల్గొన్నారు.

# దేశానికి కావాల్సింది భగత్‌సింగ్‌లే - ఏఐవైఎఫ్

కోసిగి,సెప్టెంబరు 28 (విభారె న్యూస్) ప్రస్తుతం భారత దేశానికి భగత్ సింగ్ లే కావాలి అని ఏఐవైఎఫ్ తాలుక ప్రధాన కార్యదర్శి ఎం.రాజు అన్నారు. ఈరోజు కొసిగిలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) అధ్వర్యంలో భగత్ సింగ్ 116వ జయంతిని నిర్వహించడం జరిగింది.ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ అమర వీరుడు అయిన భగత్ సింగ్ ను స్మరించుకుంటూ ఆయన మనకందించిపోయిన పోరాట వారసత్వాన్ని అంది పుచ్చుకోవాలని వారు తెలిపారు. అదే ఆయనకు మనమందించే నిజమైన నివాళి కాగలదు అని వారు అన్నారు.బ్రిటిష్ సామ్రాజ్యవాద దాస్య శృంఖలాల నుండి భారతదేశాన్ని విముక్తం చేయడానికి 23 ఏండ్ల చిరు ప్రాయంలోనే ప్రాణార్పణ గావించిన విప్లవ యోధుడు షహీద్ భగత్‌సింగ్ అని వారు కొనియాడారు. పరాయి పాలకులను దేశం నుండి తరిమికొట్టాలనే ఆకాంక్షతోనే ఆగి పోకుండా.. స్వతంత్ర భారతదేశంలో ఎలాంటి విధానాలు అవలంబిస్తే ప్రజలకు మేలు కలుగుతుందనే విషయంలోనూ సమగ్ర దృక్పథం కలిగిన కొద్దిమంది స్వాతంత్ర్య ఉద్యమకారుల్లో భగత్‌సింగ్ ఒకడు అని వారు అన్నారు. ఆయన 28 సెప్టెంబర్, 1907న నేటి పాకిస్థాన్ లోని ఫైసలాబాద్ జిల్లా, బంగా గ్రామంలో జన్మించాడని, యుక్త వయస్సులోనే స్వాతంత్ర్యోద్యమం పట్ల ఆకర్షితుడయ్యాడని, భవిష్యత్తు భారతం ఎలా ఉండాలనే అంశంపై స్పష్టమైన దక్పథం గల విప్లవకారుడు భగత్‌సింగ్ అని వారు అన్నారు. పల్లెల్లోని రైతులను, ఫ్యాక్టరీల్లోని కార్మికులను చైతన్యపరచినప్పుడే దేశంలో సమ సమాజం సిద్ధిస్తుందని కలలుకన్నాడు. మత రాజకీయాలను సమూలంగా వ్యతిరేకించాలని భగత్ సింగ్ ఆరోజుల్లోనే చెప్పాడని వారు గుర్తు చేశారు. నేడు దేశంలో ప్రజల ఐక్యతను చీల్చే మతోన్మాద రాజకీయాలు విశృంఖలంగా కొనసాగుతున్నాయని, కోట్లాది మంది సామాన్య ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసిన పాలకులు కొద్దిమంది పెట్టుబడిదారుల సేవలో తరిస్తున్నారని, ఈ గడ్డు పరిస్థితుల నుండి దేశ రాజకీయాలను సక్రమ మార్గంలో పయనింప జేయడానికి, మతపరమైన మూఢనమ్మకాల మానసిక బానిసత్వం నుండి ప్రజలు విముక్తి పొందడనికి ప్రతి ఒక్కరూ భగత్ సింగ్ ల పోరాడాలని వారు యువతకు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య వీరులు కలలుగన్న సమ సమాజం నిర్మించడానికి.. షహీద్ భగత్‌సింగ్ తాత్విక చింతనను, ఆయన



పోరాట వారసత్వాన్ని కొనసాగించడమే సరైన పరిష్కారం అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు రాజు, ప్రకాష్, నరసయ్య, దేవనంద్, బాబు, ఈరేష్, మరేష్, షణ్ముఖ, నాగరాజు తదితరలు పాల్గొన్నారు

# మహమ్మద్ ప్రవక్త సందేశం మానవాళికి హితోపదేశం

## - జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఎం సుధాకర్ బాబు



కర్నూలు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 విభారె న్యూస్.మహమ్మద్ ప్రవక్త సందేశం సర్వ మానవాళికి హితోపదేశాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎన్ సుధాకర్ బాబు అభిప్రాయపడ్డారు గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ మైనార్టీ విభాగం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు సుధాకర్ బాబు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజుని ప్రశాంతంగా జరుపుకోవడం ఆయన సందేశాన్ని ప్రజలకు అందించడమే నిజమైన పండుగ అని కొన్ని పార్టీలు అధినాయకుల మెప్పుకోసం అల్లర్లు, ఆర్భాటాలు చేస్తే దేవుడు క్షమించడని మహమ్మద్ ప్రవక్త ఇతరులకు సహాయం చేయండి కానీ చెడు చేయవద్దు అన్నాడని ఆయన సందేశాన్ని మనం పాటించి ప్రజల వద్దకు తీసుకొని వెళితేనే నిజమైన పండుగని ప్రవక్త అని మనం గౌరవించిన వారమవుతామని కొన్ని పార్టీలు రోడ్లమీద ఆర్భాటంగా జరుపుకునే వారు ఈ దేశానికి పట్టిపీడిస్తున్న మతతత్వ పార్టీకి మద్దతుదారులు అని అక్కడ ఉన్న వారంతా బిజెపికి సపోర్ట్ చేసేవారే అని బిజెపి ప్రవేశ పెట్టే ఏ బిల్లు కైనా సంపూర్ణంగా మద్దతు తెలియజేస్తారని బిజెపిని వ్యతిరేకించే పార్టీ ఒక కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని ముస్లిం మత పెద్దలు చెప్పినట్లుగా రాహుల్ గాంధీ వంక చూడటానికి కూడా మోడీ గుండెల్లో రైలు పరిగెడుతున్నాయని మోడీలో భయం మొదలైందని రాహుల్ గాంధీ ప్రధాని కావాలని దేశానికి మంచి జరగాలని మనమందరం దేవుని ప్రార్థించాలని అలాగే ముస్లిం పెద్దలందరికీ మిలాద్ ఉన్ నబి శుభాకాంక్షలు తెలుపుతున్నామని గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరగడం చాలా ఆనందంగా ఉందని మీకందరికీ హృదయపూర్వక నమస్కారములు పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని సుధాకర్ బాబు తెలియజేశారు.ముస్లిం మత పెద్దలు సయ్యద్ షా మాసుం పీర్ సాహెబ్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త ప్రపంచానికి శాంతి సందేశం ఇచ్చారని, ఆయన కులమతాలకు అతీతంగా శాంతి సందేశం ఇచ్చారని తెలియజేశారు. అనంతరం సిటీ ముస్లిం మైనార్టీ డిపార్ట్మెంట్ కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు సయ్యద్ ముజాహర్ పీర్ సాహెబ్, సయ్యద్ ముజాహిర్ భాష ఖాద్రి, సయ్యద్ జిలాని భాష ఖాద్రి, అబ్దుల్ రెహమాన్, నూర్ అహ్మద్ మీర్ షా ఖాద్రి సి దస్తగిరి సయ్యద్, రహీం భాషా ఖాద్రి, సయ్యద్ సర్ ధార్ సాహెబ్ జిల్లా మైనార్టీ డిపార్ట్మెంట్ అధ్యక్షులు నూర్ అహ్మద్, సిటీ మైనార్టీ డిపార్ట్మెంట్, అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్ డిసిసి కార్యదర్శులు రియాజుద్దీన్ ఎజాస్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ యం ఖాద్రి, మైనార్టీ సెల్ వసిబాషా మొదలగు ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను పట్టించుకోని రెవెన్యూ అధికారులు.

ఆళ్ళగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 28 విభారె న్యూస్:- సర్వోన్నత న్యాయ స్థానం ఆదేశాలను సైతం తుంగలో తొక్కి నిబంధనలకు విరుద్ధంగా రెవిన్యూ రికార్డుల ఆన్లైన్ లో రుద్రవరం తాసిల్దార్ మార్పులు చేసినట్లు ఆల మూరు గ్రామ వీరబ్రహ్మం మఠం 5వ పిఠాధిపతి అశోక్ కుమార్ ఊరఫ్ జగదేవ్ స్వామి తెలిపారు. ఈ సంద ర్భంగా బుధవారం ఆయన విలేకరుల తో మాట్లాడుతూ రుద్రవరంమండలం ఆలమూ రు గ్రామం అలాగే నరసాపు రం గ్రామాల లోని మా పూర్వీకులు మా అబ్బా గారైన మఠం శేషయ్య కు మారుడు వీరబ్రహ్మం మరియు పోతులూరి వీరబ్రహ్మం వీరు నుండి మాకు భూములు సంక్రమించాయని, దీనికి సంబంధించిన 1940 సంవ త్సరం నుండి కట్టిన పన్ను రసీదులు అలాగే పట్టాదార్ పాస్ పుస్తకాలు, ఆర్ ఓ ఆర్ రికార్డులు, అడంగల్ మాన్యు వల్, ఈసీలు తదితర రికార్డులలో మా పూర్వీకుల పేర్లు పొందు పరిచి ఉన్నాయని, ఇప్పటివరకు కూడా సాగు లో ఉన్నామన్నారు. ఆలమూరు గ్రామంలో మా పూర్వీకులు



నిర్మించిన వీరబ్రహ్మం మఠం మా పూర్వీకుల నుంచి వచ్చినా ఆస్తి మా సొంత ఖర్చులతో ఏ చందాలు లేకుండా గుడి నిర్మాణం, జీవనోధారణ చేసి స్వామివారికి పూజలు నిర్వహిస్తున్నామని ఆలమూరు గ్రామ వీరబ్రహ్మం మఠం 5వ పీఠాధిపతి అశోక్ కుమార్ ఉరఫ్ జగదేవ్ స్వామి అన్నారు. రెవిన్యూ అధికారుల తప్పిదాల వల్ల ఆలమూరు గ్రామంలో ఉన్న వీర బ్రహ్మం మఠం కడప జిల్లాలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠం మా ఆధీనంలో ఉందని మాకు నోటీసులు ఇచ్చారని,ఈ విషయమై ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్ మంజూరు చేసిందని, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా జడ్జి కడప జిల్లాలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠం కంది మల్లయ్య పల్లె వారికి హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన, ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను 2016 లో రుద్రవరం ఎతీనీ శ్రీనివాసులు, నరసాపురం ఎతీనీ రామకృష్ణ ఆన్లైన్ రికార్డులను తారుమారు చేసి వీరబ్రహ్మం మఠం పేరున రికార్డులను పొందుపరి జిల్లా ఎండోమెంట్ శాఖకు పంపించి అన్యాయం చేశారన్నారు.

# స్వాతంత్ర సమరయోధులు భగత్ సింగ్ జయంతి వేడుకలు

ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 28 విభారె న్యూస్ :- భారత స్వాతంత్ర సమరయోధుడు షహిద్ భగత్ సింగ్ మరియు నవయుగకవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి వేడుకలను అపుస్మ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. అపుస్మ నంద్యాల డివిజన్ అధ్యక్షులు టి అమిర్ భాష లో అధ్యక్షతన ఆళ్లగడ్డ పట్టణం లోని మహాత్మా జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాలలో పాఠశాలలో ప్రిన్సిపాల్ ఏ వెంకటరాముడు ఆధ్వర్యంలో ప్రధాన వక్తగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు సి రామకృష్ణ, ఆళ్లగడ్డ అరుణోదయ స్కూల్ హెచ్ఎం ఇమామ్ హుస్సేన్, ఉ పాధ్యాయ బృందం విద్యార్థులు అందరు కలిసి భగత్ సింగ్, గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



## కొనసాగుతున్న తెదేపా దీక్షలు దీక్షలో పాల్గొన్న టిడిపి నాయకులు



ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 28 విభారె న్యూస్ : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ బాబుకు తోడుగా మేము సైతం అంటూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు ఆళ్లగడ్డలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. గురువారం చాగలమర్రికి చెందిన తెదేపా నాయకులు, పలువురు కార్యకర్తలు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అన్సర్ భాష, సల్లా నాగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## అవినీతి మరక అంటించేశారుగా....

### ఎవ్వరికి అంతుపట్టని వ్యూహం

విజయవాడ, సెప్టెంబర్ 28, చంద్రబాబు తర్వాత ఎవరు? లోకేషా? రామోజీరావా? నెక్ట్స్ అరెస్టు ఎవరిది? అంటే అందరి చూపు లోకేష్ వైపే కనిపించింది. ఆ మధ్యన లండన్ పర్యటన ముగించుకుని ఏపీకి చేరుకున్న సీఎం జగన్ సిఐడి ముఖ్యులతో పాటు ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. లోకేష్ ను ఎందుకు విడిచి పెట్టారు అని ప్రశ్నించారు. రామోజీరావు, దేవినేని ఉమా, కొలికిపూడి శ్రీనివాసరావు వంటి వారిని టార్గెట్ చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. అయితే అంతటితో ఆ జాబితా ఆగలేదని.. నారా భువనేశ్వరి, బ్రాహ్మణిల పై సైతం కేసులు నమోదు చేయాలని సీఎం జగన్ ఆదేశాలు ఇచ్చినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. తనను అవినీతిపరుడుగా ముద్ర వేయడంలో చంద్రబాబు పాత్ర అధికమని ఏపీ సీఎం జగన్ అనుమానిస్తున్నారు. తనను అన్యాయంగా కేసుల్లో ఇరికించి పైశాచిక ఆనందం పొందుతున్న ప్రతి ఒక్కరి అంతు చూడడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. తనపై గోబెల్స్ ప్రచారం చేయడంలో ముందున్న రామోజీరావు తో పాటు తన కేసుల్లో ప్రమేయం ఉన్న కుటుంబాలను సైతం జగన్ విడిచిపెట్టలేదు. నాడు తనపై కేసులు వేయడంలో కీలక పాత్ర పోషించిన కింజరాపు ఎర్రన్నాయుడు కుటుంబాన్ని సైతం జగన్ వెంటాడిన సంగతి తెలిసిందే. ఎర్రన్న సోదరుడు అచ్చెనాయుడుని ఎలా టార్గెట్ చేశారో అందరికీ తెలిసిన విషయమే. తాజాగా చంద్రబాబు పై పడ్డారు. ఒక్క చంద్రబాబుతో సరిపెట్టడం లేదు. ఆయన కుమారుడు తో పాటు కుటుంబ సభ్యులపై సైతం కేసులు నమోదు చేయించాలన్న కృత నిశ్చయంతో జగన్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రాజకీయ లాభనష్టాలను పరిగణలోకి తీసుకోకపోవడం విశేషం. చంద్రబాబు ఊహకందని రీతిలో ఆయనపై కేసులు నమోదు చేశారు. జైలులో పెట్టారు. మూడు వారాలకు పైగా రిమాండ్ విధించగలిగారు. రేపో మాపో లోకేష్ ను సైతం అరెస్టు చేస్తామని సంకేతాలు ఇస్తున్నారు. అయితే దీనికే ఎల్లో మీడియా రంకెలు వేస్తోంది. ఈ తరుణంలో మరో వార్త హల్చల్ చేస్తోంది. నారా భువనేశ్వరి, బ్రాహ్మణిలపై సైతం కేసులు నమోదు చేసేందుకు సిఐడి పగడ్బంది వ్యూహం రూపొందించినట్లు తెలుస్తోంది. ఇందుకుగాను భారీగానే కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో ఆ ఇద్దరిపై పట్టు బిగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో నారా లోకేష్ ను 14వ నిందితుడిగా చేర్చిన సంగతి తెలిసిందే. ఇన్నర్ రింగ్ రోడ్డు ఏర్పాటులో హెరిటేజ్ సంస్థకు భారీగా లబ్ధి చేకూర్చినట్లు వైసీపీ నేతలు ఆరోపిస్తూ వచ్చారు. అందుకు తగ్గట్టుగానే ఈ కేసులో హెరిటేజ్ ఫుడ్ సంస్థను చేర్చడం వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. హెరిటేజ్ ఫుడ్ సంస్థలో బ్రాహ్మణి, భువనేశ్వరి కీలక హోదాల్లో ఉన్నారు. లోకేష్ కేవలం డైరెక్టర్ మాత్రమే. కానీ లోకేష్ భార్య బ్రాహ్మణి, తల్లి భువనేశ్వరి మేనేజ్మెంట్ హోదాలో ఉన్న విషయం విధితమే. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్మెంట్ కేసులో హెరిటేజ్ భారీ లబ్ధి పొందిందని సిఐడి చెప్పడం వెనుక ప్రత్యేక ఎత్తుగడ ఉన్నట్లు తెలుస్తోంది. బ్రాహ్మణి, భువనేశ్వరి లను అవినీతిలో భాగస్వామ్యం చేసేందుకేనని టాక్ నడుస్తోంది.

## మున్సిపల్ కార్మికులకు మెడికల్ కిట్ పంపిణీ

చైర్మన్, వైస్ చైర్మన్ చేతుల మీదుగా కార్మికులకు కిట్లు అందజేస్తున్న దృశ్యంఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 28 విభారె న్యూస్ :- ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని కార్మికులకు వారి ఆరోగ్య సంరక్షణలో భాగంగా మెడికల్ కిట్లను, చెత్త సేకరణ డబ్బులను అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలోనీ అన్ని వార్డులలో పరిశుభ్రత లోపించకుండా తీసుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునికి ఉందన్నారు. ఆయా వార్డుల కౌన్సిలర్లకు బాధ్యత తో పాటు కమాండింగ్ ఇవ్వడం ద్వారా ఇది సాధ్యపడుతుందన్నారు. వైస్ చైర్మన్ నాయక్ రసూల్ మాట్లాడుతూ ఇండ్లలోని చెత్తను ప్రజలు రోడ్లపై పడవేస్తున్నారని అలా కాకుండా చెత్త ఇంట్లో డబ్బాలో కానీ, బయట పారిశుధ్య కార్మికుని చెత్త డబ్బాలో కానీ ఉండే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్య కార్మికులకు ప్రజలకు మధ్య అనుబంధమున్నప్పుడే ఇది సాధ్యమవుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు మాట్లాడుతూ ఆళ్లగడ్డ మున్సిపాలిటీని క్లీన్ అండ్ గ్రీన్ గా ఉంచాలంటే ప్రజలతోపాటు మున్సిపల్ కార్మికుల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వ పరంగా కార్మికులకు వారు ఆరోగ్యకరంగా ఉండేందుకు మెడికల్ కిట్లను రెండో విడతగా అందజేయడం జరుగుతుందన్నారు.



గ్లౌజ్ తో పాటు కొబ్బరి నూనె, సబ్బులు అందజేశారు. త్వరలో మున్సిపల్ కార్మికుల యూనిఫామ్ కూడా అందజేయడం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 27 వార్డులలో చెత్తను సేకరించినందుకు 400 పెద్ద టబ్బులను అందజేయడం జరిగిందన్నారు. మున్సిపల్ కార్మికుల ఆరోగ్యం కోసం హెల్త్ క్యాంపులు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శాలరీ ఇన్స్పెక్టర్ సునీత, సచివాలయ అధికారి బాలస్వామి, కార్మికులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఆళ్లగడ్డ విద్యార్థుల ఎంపిక



ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 28 విభారె న్యూస్:- రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఆళ్లగడ్డ వైపిపీఎం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపిక అయ్యారనిపాఠశాల ప్రధానోపాధ్యాయులు పివి రాఘవయ్య తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లా ల, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యం లో హ్యాండ్ బాల్ అండర్ 14 అండర్ 17 విభాగాలలో నిర్వహించిన ఎంపిక పోటీలలో వైపిపిఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు ఎంపిక కావడంజరిగిందన్నారు. అండర్ 14 విభాగం లో మా విద్యార్థులు వివేకానంద, అండర్ 17 విభాగంలో అజయ్ ఎంపికయ్యారన్నారు.అండర్ 17 రాష్ట్ర పోటీలు గుంటూరు జిల్లా తెనాలిలో29వ తేదీ నుండి ఒకటో తేదీ వరకు నిర్వహిస్తామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ పివి రాఘవయ్య గారు తెలియజేశారు, ఎంపిక కాబడిన క్రీడాకారుల్ని పాఠశాల ఉపాధ్యాయుడు వీర రాఘవయ్య వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభాకర్ఉపాధ్యాయబృందంతదితరులుఅభినందించారుఅభినందించారు

## దళిత హక్కుల కోసం పోరాడిన వెంకటస్వామి ఆశయాలను కొనసాగిస్తాం

### కెవిపి యస్ జిల్లా కార్యదర్శి ఆనంద్ బాబు





కర్నూలు, సెప్టెంబర్ 28 విభారె న్యూస్ : దళిత హక్కుల కోసం నిరంతరం పోరాడిన పి వెంకట స్వామి ఆశయాలను కొనసాగిస్తామని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు తెలిపారు ఈరోజు కల్లూరు సూర్య నారాయణ భవన్ నందు పి వెంకటస్వామి సంతాప సభ కె వి పియస్ నగర అధ్యక్షుడు జి ఏసు అధ్యక్షతన జరిగింది ఈ సంతాప సభకు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్ బాబు కెవిపిఎస్ నగరకార్యదర్శి యం భాస్కర్ పెదబాబు యంసి ఆనందు సిఐటియు నగర అధ్యక్షుడు ఆర్ నరసింహులు కె సుధాకరప్ప హాజరయ్యారు ముందుగా వెంకట స్వామి గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటస్వామి బడుగు బలహీన వర్గాల ప్రజలకు సంబంధించిన సమస్యల పట్ల నిరంతరం శ్రమించేవాడని తెలిపారు శరీన్ నగర్ ప్రాంతంలో కాపురం ఉంటూ దళితుల సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేసేవాడని రేషన్ కార్డులు పెన్షన్లు స్థానిక సమస్యలు వంటి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేసే వ్యక్తి వెంకటస్వామి అని తెలిపారు అంతేకాకుండా వృత్తిరీత్యా మట్టిపని మేస్త్రి గా పనిచేస్తూ మట్టి పని కార్మికులు భవన నిర్మాణ కార్మికుల సమస్యలు కూడా తీసుకొని పనిచేసేవాడని తెలిపారు కళాకారుడుగా అనేక సాంఘిక నాటకాలలో పద్యాలు ఆలాపన చేసేవారని తెలిపారు ప్రజాసంఘాలు ఇచ్చిన ప్రతి కార్యక్రమంలో పాల్గొనే వాడని తెలిపారు వెంకటస్వామి మృతి కెవిపిఎస్ కు భవనిర్మాణ కార్మిక సంఘానికి వారి కుటుంబ సభ్యులకు తీరని లోటని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు భార్య లక్ష్మి దేవి కొడుకు శ్రీనివాసులు కూతురు శ్రీలేఖ హాజరయ్యారు రోశయ్య మట్టి పని మేస్త్రీలు కృష్ణ జయన్న ఈశ్వరమ్మ సరోజమ్మ ఎల్లమ్మ శాంతమ్మ శేషమ్మ డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణ తదితరులు హాజరయ్యారు

## ఎన్ ఎస్ యు ఐ ఆధ్వర్యంలో ఘనంగా భగత్ సింగ్ 116వ జయంతి




విభారే న్యూస్ డోన్ ప్రతినిధి:- సెప్టెంబర్ 28 డోన్ పట్టణంలో ఎన్.ఎస్.యు.ఐఆధ్వర్యంలో సర్దార్ భగత్ సింగ్ జయంతిని ప్రభుత్వ బి.సి బాలికల హాస్టల్లో వార్డెన్ మేరీ అధ్యక్షతన యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకట సుబ్బారెడ్డి, యూటీఎఫ్ సీనియర్ నాయకులు సుబ్బారాయుడు తో పూలమాలవేసి భగత్ సింగ్ 116వ జయంతిని పురస్కరించుకోవడం జరిగింది.ఈ సందర్భంగా ఎన్.ఎస్.యు.ఐ జిల్లా నాయకులు తెలుగు విజయ్ కుమార్ , మాట్లాడుతూ భగత్ సింగ్ ఆనాడు పంజా బ్ లోని ప్రస్తుత పాకిస్తాన్లో ఉన్నటువంటి లాహోర్ పూర్ జిల్లాలోని బత్కర్ కలాం గ్రామంలో 1907 సెప్టెంబర్ 28 శనివారం నాడు జన్మించాడు. భారత స్వాతంత్ర్య సమర యోధుడు ప్రఖ్యాత ఉద్యమకారుడు. స్వాతంత్ర్యోద్యమం లో పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవకారులలో అతను ఒకడు. ఈ కారణంగానే షహీద్ భగత్ సింగ్ గా కొనియాడబడుతున్నాడు. దేశ స్వాతంత్ర్యం కోసం 23 సంవత్సరాలకే తెల్లదొరలకు వణుకు పుట్టించినటువంటి యువ నాయకులు భగత్ సింగ్, రాజ్ గురు,సుఖ్ దేవ్, దేశం కోసం ఉరికంబాన్ని ముద్దాడి వారి ప్రాణాలను సైతం అర్పించిన భారత ముద్దుబిడ్డలని వారు కొనియాడారు.దేశానికి స్వేచ్ఛ వచ్చిందని భావించిన విద్యా విధానంలో మాత్రం స్వేచ్ఛ రాలేదని ఎన్.ఎస్.యు.ఐ నంద్యాల జిల్లా నాయకులు తెలుగు విజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.ఆనాడు భగత్ సింగ్ తెల్లదొరలతో స్వాతంత్రం కోసం పోరాడితే , ఈనాడు విద్యారంగంలోని సమస్యల కోసం ఈ నల్ల దొరలతో విద్యార్థులు పోరాడవలసి వస్తుందని వారు ఆగ్రహ వ్యక్తం చేశారు.రాబోయే రోజుల్లో విద్యార్థులు ప్రభుత్వంపై పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.యు.ఐ నాయకులు తేజ, మధు ,చరణ్, మధు కృష్ణ, లక్ష్మీనారాయణ, రవి, గని మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## శ్రీ శైలంలో పడిపోయిన నీటిమట్టం



కర్నూలు, సెప్టెంబర్ 28, ఇక్కడ వర్షాలు లేవు?పైనుంచి వరదలు లేవు. దీంతో శ్రీశైలం రిజర్వాయర్లో నీటి మట్టం గణనీయంగా పడిపోయింది. వరద నీరు లేకపోవడం, ఉన్న నీటిని విద్యుత్ అవసరాలకు వినియోగించడంతో ప్రాజెక్టులో నీటి నిల్వ పాతాళానికి పడిపోయింది. దీంతో పంటలకు నీళ్లు వదిలే పరిస్థితి లేకుండా పోయింది. శ్రీశైలం రిజర్వాయర్కు ఈ ఏడాది వరద లేకపోవడంతో ఆరు లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. దీనివల్ల నంద్యాల జిల్లాకే అత్యధిక నష్టం జరిగింది. 215 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గాను ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 86 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. 885 అడుగులు ఉండాల్సిన నీటిమట్టం?.ప్రస్తుతం 853 అడుగులకు పడిపోయింది. నీటి మట్టం 854 అడుగులకు పైన ఉంటేనే పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల జరిగే అవకాశం ఉంది. ఆ అవకాశం లేకపోవడంతో నీటి విడుదలకు అడ్డుకట్ట పడింది. దీంతో తెలుగు గంగ, ఎస్సార్బీసీ, కేసీ కెనాల్ కింద ఆరు లక్షల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది.రిజర్వాయర్లో నీటిమట్టం బాగా పడిపోవడంతో వరి పంటకు నీరు ఇవ్వలేమని, ఆరుతడి పంటలకు మాత్రమే నీరిస్తామని ఇప్పటికే అధికారులు ప్రకటించారు. అయినప్పటికీ కొందరు రైతులు వరి నాట్లు వేశారు. దీంతో అవి కాస్తా ఎండిపోయే పరిస్థితి వచ్చింది. ఈ పరిస్థితుల్లో శ్రీశైలం నుంచి సాగు నీటి విడుదల కష్టమే అంటున్నారు అధికారులు. అక్టోబర్ 19 వరకు వర్షాలు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నప్పటికీ..అవి ఎప్పుడు వస్తాయో? వచ్చినా వరదలు వస్తాయా అనేది అనుమానమే అంటున్నారు రైతులు. ఇక ఎగువ రాష్ట్రాల నుంచి భారీగా వరద నీరు వస్తేనే శ్రీశైలం రిజర్వాయర్ నిండుకుండలా మారుతుంది. అయితే ఈ పరిస్థితులు లేకపోవడంతో శ్రీశైలం నుంచి తాజాగా నీటిని విడుదల చేసే అవకాశం కనుచూపుమేరలో కనిపించడం లేదు.గత ఏడాది ఇదే సమయానికి డ్యామ్ పూర్తిగా నిండిపోయి వందల టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేసిన పరిస్థితి ఉంది. సాగర్ కూడా నిండి గేట్లు ఎత్తారు. పంటలకే కాదు, శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి అనేక రిజర్వాయర్లను, చెరువులను కూడా నింపిన పరిస్థితి గత ఏడాది కనిపించింది. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తి భిన్నంగా ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడిప్పుడే బియ్యం ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఒకింత సంతృప్తిగా ఉన్నారు. అయితే డ్యామ్ నిండని కారణంగా వరి వేయద్దు?ఆరుతడి పంటలు మాత్రమే వేయండి అని అధికారులు చెప్పడంతో నెత్తిన పిడుగు పడినట్లయిందని శ్రీశైలం బ్యాక్ వాటర్ ఆధారిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.విద్యుత్ ఉత్పత్తి కోసం ప్రాజెక్టులో నీటిని ఎడాపెడా వదిలేయడంతోనే ఈ దుస్థితి దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విభజన చట్టం ప్రకారం శ్రీశైలం ప్రాజెక్టులో 60 టీఎంసీల నీళ్లు నిల్వ ఉంచాలని, ట్రిబ్యునల్ కూడా అదే చెప్పిందని, కానీ అది జరగకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. పంటలు కళ్ల ముందే ఎండిపోతుండడంతో రైతులు గుండెలు ఆవేదనతో మండిపోతున్నాయి.

## బాలినేని అనుచరులపై వేటు...

ఒంగోలు, సెప్టెంబర్ 28, ఉమ్మడి ప్రకాశం జిల్లా వైసీపీ వ్యవహారం మళ్ళీ మొదటికి వస్తోందా? అంటే.. జరుగుతున్న పరిణామాలను బట్టి చూస్తుంటే.. అలానే అనిపిస్తోందంటున్నాయి రాజకీయ వర్గాలు. పార్టీ కీలక నేత, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి ముఖ్య అనుచరులుగా ఉన్న ఇద్దరు నాయకులపై పార్టీ వ్యతిరేక కార్యకలాపాల పేరుతో సస్పెన్షన్ వేటేయడంతో చర్చ మళ్లీ మొదలైంది. జిల్లా పార్టీలో జరుగుతున్న వ్యవహారాలపై అలక, కినుక వహించిన బాలినేని చాలా రోజుల పాటు అంటీ ముట్టనట్టుగానే ఉన్నారు. కానీ, రీజినల్ కో ఆర్డినేటర్గా విజయసాయిరెడ్డి బాధ్యతలు స్వీకరించాక ఏర్పాటు చేసిన సమావేశంలో బాలినేని తిరుగులేని నాయకుడని పొగడటం, ఇక నుంచి జిల్లా పార్టీ వ్యవహారాలు ఆయన కనుసన్ననల్లోనే జరుగుతాయని చెప్పడంతో ఇక ఆల్ సెట్ అనుకున్నారు అంతా. సీఎం జగన్ మనసులో ఉన్న మాటలనే తాను చెబుతున్నానని విజయసాయి అనడంతో మాజీ మంత్రి సైతం శాంతించినట్టు చెబుతున్నారుకానీ? ఇంతలోనే బాలినేని సన్నిహితుడు, సంతనూతలపాడు వైసీపీ పరిశీలకుడు భవనం శ్రీనివాసరెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. పర్చూరు నియోజకవర్గ ముఖ్యనేతగా ఉన్న శ్రీనివాసరెడ్డి భార్య శ్రీలక్ష్మి ఇంకొల్లు జడ్పీటీసీ ఉన్నారు. నియోజకవర్గంలో పర్చూరు వైసీపీ ఇంచార్జ్ ఆమంచి కృష్ణమోహన్కు, శ్రీనివాసరెడ్డి వర్గానికి పొసగడం లేదట. ఆమంచి వ్యవహారాలపై భవనం దంపతులు ఇద్దరూ బహిరంగంగానే ఆరోపణలు చేస్తున్నారు.. దీంతో శ్రీనివాసరెడ్డిపై ఆమంచి కృష్ణమోహన్ కూడా అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. దానికి అనుగుణంగానే.. అధిష్టానం ఆయన్ని సస్పెండ్ చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఆయనతో పాటు ఇటీవలే మార్కాపురం వైసీపీ నేత పెద్దిరెడ్డి సూర్యప్రకాష్ రెడ్డిని కూడా వైసీపీ అధిష్టానం సస్పెండ్ చేసింది. ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డిపై బహిరంగంగానే అవినీతి ఆరోపణలు చేశారు సూర్యప్రకాష్ రెడ్డి. ఎమ్మెల్యే సోదరులు భూ ఆక్రమణలు చేశారని, అందుకు మంత్రి ఆదిమూలపు సురేష్ అన్ని విధాలుగా సహకరిస్తున్నారని ఆరోపించారు.ఒంగోలులో జరిగిన సమీక్షా సమావేశంలో గొడవ అవడం, అందరి మీద విజయసాయి సీరియస్ అవడం లాంటి ఘటనలు జరిగాయి. ఆ తర్వాత పెద్దిరెడ్డిని సస్పెండ్ చేస్తూ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది.

ఇద్దరు నేతలను పార్టీ వ్యతిరేక కార్యకలాపాల పేరుతో సస్పెండ్ చేసేదాకా బాలినేనికి కనీస సమాచారం లేదట. మాట మాత్రం చెప్పకుండా తన అనుచరులపై వేటు వేయడం ఏంటంటూ బాలినేని రగిలిపోతున్నట్టు తెలిసింది. పార్టీలో అసలేం జరుగుతోందో అర్థం కావడం లేదంటూ మాజీ మంత్రి సీరియస్గానే ఉన్నట్టు సమాచారం.

## ఎం .ఎస్ .స్వామినాథన్ మృతికి సిపిఐ సంతాపం.

కర్నూలు, సెప్టెంబర్ 28 విభారె న్యూస్ :కర్నూలు... హరిత విప్లవ పితామహుడు, వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్ స్వామినాథన్ మృతికి సిపిఐ జిల్లా సమితి తరపున ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య ఒక ప్రకటనలో తెలియజేస్తూ, రైతుల కష్టాలకు కారణాలు, రైతుఆత్మహత్యల నివారణ, నీటిపారుదల, పండించిన పంటకు గిట్టుబాటుధర, రుణసౌకర్యం, పంటల బీమా, తదితర అంశాలపై లోతుగా దేశవ్యాప్తంగా అధ్యయనం చేయడానికి స్వామినాథ నేతృత్వంలో వేసిన కమిషన్ నివేదికను 2006 అక్టోబర్ 4 న గత యూ.పీ.ఏ ప్రభుత్వానికి అందజేశారని అయినప్పటికీ ఇప్పటివరకు ఆ సిఫారసులు అమలుకు నోచుకోలేదని, ఆయన నివేదికలో వ్యవసాయ ఉత్పత్తుల కోసం రైతు పెట్టిన పెట్టుబడికి అదనంగా 50 శాతం కలిపి ధర కల్పించాలని ఈ విధంగా చేస్తే రైతు నష్టపోడని ఆయన స్పష్టంగా చెప్పాడని, అయినప్పటికీ పాలక ప్రభుత్వాలు అమలు చేయకుండా రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నాయని, ఇలాంటి ప్రముఖవ్యవసాయ శాస్త్రవేత్త మృతి చెందడం దేశానికి తీరనిలోటని ఆయన మృతికి ప్రగాఢ సంతాపం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు బి.గిడ్డయ్య తెలియజేశారు.

## నేడు కౌన్సిలర్ సదారణ సమావేశం"

### రవి చంద్రా రెడ్డి మున్సిపల్ కమిషనర్"



నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 28-విభారె న్యూస్ :- నంద్యాల మున్సిపల్ కార్యాలయం లో గురువారం మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి మాట్లాడుతూ నంద్యాల పురపాలక సంఘము నందు 29 వతేదిన ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాలు నందు కౌన్సిల్ సమావేశం జరుగునని తెలిపారు. కావున సదరు సమావేశానికి ప్రజా ప్రతినిధులు మున్సిపల్ సిబ్బంది హాజరు కావలసినదిగా కోరారు.

## దేశం గర్వించదగిన యోధుడు భగత్ సింగ్



ఎమ్మిగనూరు టౌన్ సెప్టెంబర్ 28 విభారె న్యూస్:-విప్లవ వీరుడు భగత్ సింగ్ దేశం గర్వించదగిన యోధుడని మెగాస్టార్ ఫ్యాన్స్ సేవా సమితి తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్ సాగర్,భరత్ సాగర్ లో అన్నారు. భగత్ సింగ్ 114వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో చరిత్ర సృష్టించారని ఆయనపోరాటపటిమఎంతోమందికి స్ఫూర్తిదాయకమయిందని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు దత్తు, శివ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా జర్నలిస్ట్ లకు ఉచిత మెడికల్ క్యాంప్.

కర్నూలు సెప్టెంబర్ 28 విభారె న్యూస్.కలెక్టరేట్ కాంప్లెక్స్ లోని డిపిఆర్ఓ కార్యాలయం ఆవరణం లో ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా కర్నూలు కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ రోజు జర్నలిస్ట్ లకు ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.జయమ్మ ఒక ప్రకటనలో తెలిపారుమెడికల్ క్యాంప్ లో బిపి, షుగర్, ఈ సి జి, టుడి ఎకో పరీక్షలను ఉచితంగా చేయడం తో పాటు కిమ్స్ హాస్పిటల్ వైద్యులు, కార్డియాలజిస్టు నాగేంద్ర ప్రసాద్ కన్సల్టేషన్ ఉచితంగా అందిస్తారని,ఈ అవకాశాన్ని జర్నలిస్టులతో పాటు వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవలసిందిగా ఆమె తెలిపారు.

## భగత్ సింగ్ 116 వా జయంతి వేడుకలు

పెద్దకడుబూరు సెప్టెంబరు 28: (విభారె న్యూస్)పెద్దకడబూరు మండల సి పి ఐ ఆఫీస్ నందు ఎఐవైయఫ్ అద్వర్యం లో ఘనంగా భగత్ సింగ్ 116 వా జయంతి వేడుకలు. ఇ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎఐవైయఫ్ తాలూకా అద్యక్షులు ఆర్. జాఫర్ పటేల్ మాట్లాడుతు సర్దార్ భగత్ సింగ్ త్యాగాలు చిరస్మరణ్యం అని తెలియజేషారు . భరతదేశ స్వతంత్ర పోరాటంలో ముఖ్య పాత్ర పోశించారు. దేశ స్వతంత్ర కోసం ఊరికొయ్యలను ము ముద్దడి నా యువ కిశోరామ్ సర్దార్ భగత్ సింగ్ . 13 సంవత్సరాల వయస్సులోనే దేశభవిషత్తు పై ఆలోచించిన వ్యక్తి సర్దార్ భగత్ సింగ్, యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని తమ జీవితంలో వచ్చే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని తెలియజేశరు. ఇ కార్య క్రమంలో ఎఐకెయస్ తాలూకా అద్యక్షులు ఆంజినేయులు, కల్లుకుంట వీరేష్, భీమ స్వామి, రాజు , వీరేంద్ర, మరియూ ఇతారులు పాల్గొన్నారు



# ఘనంగా విప్లవ వీరుడు సర్దార్ భగత్ సింగ్ జయంతి

కర్నూలు, సెప్టెంబర్ 28 విభారె న్యూస్ : కర్నూల్ నగరంలోని సిఆర్ భవన్ నందు అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ భగత్ సింగ్ 116వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి బిసన్న అధ్యక్షత ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిలు ఎస్ మునెప్ప, ఎస్ ఎన్ రసూల్ లు పాల్గొని భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ పరాయి పాలను నుండి మాతృభూమి విముక్తి కోసం నువ్వు నువ్వు మీసాల వయసులోనే 23 సంవత్సరాలకే ఉరితాడు వర్ణమాలగా స్వీకరించి మరనాన్ని అవహేళన చేస్తూ తన ప్రాణాన్ని తృణప్రాయంగా వదిలిన సర్దార్ భగత్ సింగ్ నేటి యువతకు ఆదర్శ పాయడని వారు కొనియాడారు దేశంలోని యువకులందరూ భగత్ సింగ్ స్ఫూర్తితో దేశంలో జరుగుతున్న మత రాజకీయాలకు వ్యతిరేకంగా అసమానతలు లేని సమాజం కోసం ఉద్యమించాలని అప్పుడే ఆయనకు నిజమైన నివ్వాలని వారు కొనియాడారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ 1907 సెప్టెంబర్ 28 పూర్వపు పంజాబ్ రాష్ట్రంలో లాయల్ జిల్లా బాగా సమీపంలోని కత్తర్ కలాం గ్రామంలో సర్దార్ కిషన్ సింగ్ విద్యావతి దంపతులకు భగత్ సింగ్ జన్మించాడు కుటుంబ నేపథ్యం స్వాతంత్ర ఉద్యమంలో భాగం కావడంతో అతను చిన్నప్పటి నుండే దేశభక్తి బావలు పుష్కలంగా కలిగిన భగత్ సింగ్ మూడు సంవత్సరాల వయసులోనే తండ్రితో కలిసి పొలానికి వెళ్లి చిన్నచిన్న గడ్డి ముక్కలు నాటుతూ గడ్డి మొక్కలు నాటుతున్నాను మొక్కల చెట్లయి చెట్లకు తుపాకులు కాస్తాయని తండ్రితో చెప్పడం చూస్తే బ్రిటిష్ వారి పట్ల పోరాడేందుకు ఎంత దృఢ నిశ్చయంతో ఉన్నాడో అర్థమవుతుందన్నారు చదువుతున్న కాలంలో గద్దర్ పార్టీలో సభ్యుడిగా ఉంటూ స్వాతంత్ర పోరాటం చేశాడన్న బ్రిటిష్ ప్రభుత్వం స్వాతంత్ర ఉద్యమకారులను అంచి వేయడం కోసం నల్ల చట్టాలు తీసుకొస్తే వాటికి వ్యతిరేకంగా ఢిల్లీ కోర్టులో పొగ బాంబుల, కరపత్రాలు వేసి తప్పించుకోవడానికి అవకాశం ఉన్నప్పటికీ పోలీసులకు పట్టుబడి కోర్టు ద్వారా యువతలో చైతన్యం నింపడం కోసం వాదనలు



వినిపించిన యోధుడు అన్నారు, భారతదేశంలో అసమానతలు, మత ద్వేషాలు లేని స్వతంత్ర భారతదేశం కావాలని కలలు గన్న నిజమైన స్వాతంత్ర పోరాట యోధుడు సర్దార్ భగత్ సింగ్ అని కొనియాడారు, నేడు భారతదేశంలో 42 శాతం మంది యువకులు ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగంలో మగ్గుతున్నారన్నారు యువతకు ఉపాధి కల్పించవలసిన పాలకులు రాజకీయాలు చేస్తూ యువకుల మధ్య మత ద్వేషాలను పెంచి పోషిస్తున్నారని యువకులు వీటన్నిటిని గ్రహించి భగత్ సింగ్ 116వ సందర్భంగా ఆయన ఉద్యమ స్ఫూర్తితో భగత్ సింగ్ నేషనల్ గ్యారెంటీ ఎంప్లాయిమెంట్ యాక్ట్ కోసం ఉద్యమించి సాధించుకొని భారత రాజ్యాంగం కల్పించిన, ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉపాధి హక్కుల కోసం పోరాడి సాధించుకున్నప్పుడే భగత్ సింగ్ నిజమైన నివాళి అని ఆయన యువతకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి జి చంద్రశేఖర్, నగర అధ్యక్షులు బాబయ్య, నగర నాయకులు హుస్సేన్ భాష, కృష్ణ, చిన్న, మధు, చంద్రుడు, సూర్యనారాయణ, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# మతోన్మాదం పై పోరాటానికి భగత్ సింగ్ జీవితం మార్గదర్శకం-ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ

### భగత్ సింగ్ జయంతి సందర్భంగా ర్యాలీ

కర్నూలు, సెప్టెంబర్ 28 విభారె న్యూస్ : కర్నూల్ నగరంలోని స్థానిక కొత్త బస్టాండ్ నుండి సుందరయ్య జంక్షన్ వరకు భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం భగత్ సింగ్ చిత్రపటానికి ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు అబ్దుల్లా నగేష్ అధ్యక్షులు రాఘవేంద్ర సాయి ఉదయ్ పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నగేష్ అబ్దుల్లా మాట్లాడుతూ భగత్ సింగ్ 1907వ సంవత్సరం బంగా గ్రామంలో జన్మించాడని తెలిపారు. స్వాతంత్ర పోరాటంలో చిన్న వయసులోనే లాల లాజపతిరాయ్ పోరాటానికి ఆకర్షితుడై దేశంలోనే విద్యార్థులను యువకులను ఏకం చేసి నాటి సామ్రాజ్యవాద బ్రిటిష్ పాలనను భారతదేశం నుండి తరిమికొట్టే విప్లవ యువతరానికి నవ జవాన్ నిర్మాణ సభ మరియు హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ ఆర్మీఏర్పాటుచేసి బ్రిటిష్ పాలకులను గడగడలాడించాడని తెలిపారు. భగత్ సింగ్ ఆయన సహచరులు రాజ్ గురు సుఖదేవ్ లను 1931 మార్చి 23న బ్రిటిష్ ప్రభుత్వం లాహోర్ జైలులో ఉరితీసారని తెలిపారు. 1927లో నాటి పరిస్థితులను ఉద్దేశించి కీర్తి అనే పత్రికలో భగత్



సింగ్ రాసిన వ్యాసంలో భారతదేశంలో పరిస్థితి నేడు దయనీయంగా మారింది ఒక మతం వారు ఇతర మతం వారిని బద్ధ శత్రువులుగా చూస్తున్నారు నేడు దేశ భవిష్యత్తు చీకటిగా కనిపిస్తుంది ఈ మత రాజకీయాలు భారతదేశాన్ని దెబ్బతీశాయి ప్రపంచ వేదికపై భారతదేశానికి సిగ్గుచేటుగా పరినమించాయి సామాన్య ప్రజలపై సాగుతున్న దారుణాల నుండి రాజకీయ ప్రయోజనాలను పొందేందుకే నాయకులు ప్రయత్నిస్తున్నారు అని సరిగ్గా 96 సంవత్సరాల క్రితమే మత ఉన్మాదాన్ని ఉద్దేశించి రాశారని తెలిపారు. నేడు సరిగ్గా భారతదేశంలో మతాన్ని రాజకీయాలకు ఉపయోగించుకొని మతవిద్వేషాలను పెంచి పోషిస్తూ ప్రజలు తమ అసలైన సమస్య నిరుద్యోగం పేదరికం దుర్భర పరిస్థితిలో నుండి మెరుగైన జీవితాన్ని పొందడానికి పోరాటం చేయకుండా మతోన్మాదులు ప్రజల మధ్య చీలికలు పెడుతున్నారని ఆరోపించారు. భగత్ సింగ్ తన గురువు అయినా లాల లజపతిరాయ్ మతాన్ని రాజకీయాలకు ఉపయోగిస్తే తీవ్రంగా వ్యతిరేకించాడని తెలిపారు. మతం పేరుతో ప్రాంతం పేరుతో కులం పేరుతో ఐక్యం చేయడం అంటే ప్రజల సమస్యలను పక్కదారి పట్టించి ప్రజల జీవితాలను మరింత దుర్భర పరిస్థితుల్లోకి నెట్టడానికి చేసే ప్రయత్నం అని తెలిపారు. కావున భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాడి భారతదేశంలోని విద్య పేద మధ్యతరగతి వర్గాలకు అందకుండా నూతన విద్యా విధానం పేరుతో విద్యా వ్యాపారీకరణ విద్య కార్పొరేటీకరన విద్యా కాషాయీకరణ కు మరియు భారీగా పెరిగిన నిరుద్యోగము ధరల పెరుగుదల పేదరికం తలసరి ఆదాయంలో వ్యత్యాసం సామాజిక అసమానతలు, ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా విద్యార్థులు యువకులు పోరాడాల్సిన ముఖ్యమైన సమయం ఆసన్నమైందని తెలిపారు. మత ఉన్మాదుల నుండి భారత రాజ్యాంగాన్ని, దేశాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, జిల్లా నాయకులు శిరీష, నగర నాయకులు వినయ్ సిటీ కార్యదర్శి సాయి ఉదయ్సిటీ ఉపాధ్యక్షులు అబుబాకర్ సిటీ నాయకులు ఆర్యన్ వీరేష్ తేజ , వీరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 16వ రోజు కు చేరుకున్నరిలే నిరాహారదీక్షలు...



విభారె న్యూస్ డోన్ ప్రతినిధి:- సెప్టెంబర్ 28 నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ పై బాబు తో మేము సైతం అంటూ... డోన్ మండలం, దేవరబండ , మిద్దెపల్లె గ్రామ టిడిపి నాయకులు, రైతులు, ప్రజలు రిలే నిరాహారదీక్షలో గురువారం కూర్చున్నారు.ఈ దీక్ష కార్యక్రమం డోన్ మండలం టిడిపి అధ్యక్షులు సలీంద్ర శ్రీనివాసులు యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి, రాష్ట్ర తెలుగుదేశంపార్టీ కార్యదర్శి వలసల రామకృష్ణ దీక్షలో కూర్చున్నా వారికి సంఘీభావం తెలిపారు.దీక్షలో కూర్చున్నా వారు: సీనియర్ టిడిపి నాయకులు టి.ఈ.వెంకటనారాయణ గౌడ్, క్లస్టర్ ఇంచార్జ్ గోవిందు, శ్రీనివాసులు, రామన్ గౌడ్, మధు గౌడ్, టి.సుధాకర్, కె.గోపాల్, ఆనంద్, నరసింహులు, అనుమప్ప, నాగరాజు, బాలగిడ్డయ్య, వెంకటరమణ, మదనగోపాల్, రమేష్, నాయుడు, రంగస్వామి, కంబయ్య, శ్రీనివాసులు, బాల రాజు, రామాంజనేయులు, గిరి బాబు, పులికొండ, లక్ష్మన్ గౌడ్, శ్రీనివాసులు గౌడ్, బలరాముడు, చంద్రశేఖర్, పోతులూరి ఆచారి, రామాంజి, పులిశేఖర్, పెద్దయ్య, రంగస్వామి, శంకర్, చిన్న పెద్ది, వేంకటేష్, అంజి, రవికుమార్, శ్రీను, రమేష్, సుంకన్న, రామాంజనేయులు, వేంకటేశు, హరి కృష్ణ, శివకృష్ణ, రాజు, సుంకన్న, ఈశ్వరయ్య, మహేష్, వెంకటరాముడు, రంగస్వామి, సురేష్, సుంకన్న, కాంతరెడ్డి, మధు, విరేష్, శ్రీరాములు, మనోహర్, తదితరులు.సంఘీభావం తెలిపిన వారు: డోన్ నియోజకవర్గ టిడిపి సలహాదారుల కమిటీ అధ్యక్షులు మురళీకృష్ణ గౌడ్, డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు , అడ్వకేట్ లక్ష్మిశెట్టి క్రిష్ణప్రసాద్, గోవిందరెడ్డి మరియు డోన్ నియోజకవర్గ టిడిపి నాయకులు సంఘీభావం తెలిపారు.

## ఆశ వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలి

అలంపూర్ (కర్నూల్) సెప్టెంబర్ 28 విభారె న్యూస్.ఉండవల్లి మండల కేంద్రంలో ఎమ్మార్వో ఆఫీస్ కార్యాలయం ఆవరణలో నిరవధిక సమ్మె తో సీఐటీయూ జిల్లా నాయకులు బీ.నరసింహ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ,18000/-రూ,లు అమలు చేయాలని ఆశ వర్కర్లకు కనీస వేతన అమలు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విపలమైందని అన్నారు ఆశలకు పి. ఎఫ్, ఇ ఐస్ ఐ సౌకర్యనీ ఉద్యోగ భద్రత కల్పించాలి హెల్త్ కార్డులు ఇవ్వాలి రిటైర్డ్ మెంట్ బెనిఫిట్స్ 5 లక్షలు ఇవ్వాలి ప్రమాద బీమా సౌకర్యం ఐదు లక్షలు ఇవ్వాలి అని అన్నారు సి ఐ టి యు మండల కార్యదర్శి యం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆశ వర్కర్లు 28. వేల మంది హెల్త్ డిపార్ట్మెంట్ లో పని చేస్తున్నారు వీరందరూ బడుగు బలహీన వర్గాలకు చెందిన వారని రాష్ట్రంలో పేద ప్రజానీకా నికి ఆరోగ్య సేవలు అందిస్తున్నారు అని అట్టి వారికి కనీస వేతనం అమలు చేయకుండా పట్టించుకోక పోవడం అన్యాయం అన్నారు ఆశ వర్కర్స్ నిరవధిక సమ్మెకు మద్దతుగా తెలుపుతూ సెంట్రింగ్ యూనియన్ ఉండవెల్లి బి. కృ[illegible] సైదు భాష మధు నాగరాజు ఆ[illegible] వర్కర్లు అమ్ములమ్మ పుష్పావ[illegible] వెంకటేశ్వరమ్మ మదనమ[illegible] రాజమ్మ పద్మావతి వరలక్ష్మి[illegible] భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



# నంద్యాల లో అభివృద్ధి పనులను వాగ్దానాలతో సరిపెట్టారు"

నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 28 విభారె న్యూస్ :- నంద్యాల అభివృద్ధి పనులను వాగ్దానాలతో సరి పెట్టారని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు . పట్టణంలో గతంలో అండర్ డ్రైనేజీ నిర్మాణం పనులు అదిగో ఇదిగో అంటూ ఇంతవరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్ట లేదని చిన్న పాటి వర్షానికే డ్రైనేజీ లు పొంగి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే రింగ్ రోడ్డు అన్నారు పాలకేంద్రం వద్ద రోడ్డు వేశారు రైల్వే గేటుకు ఇంతవరకు మంజూరు చేయలేక పోయారని దాని వల్ల రింగ్ రోడ్డు నిర్మాణం పనులు జరగ లేదని రాజకీయ నాయకులు అశ్రద్ధ వల్లే నిలిచి పోయిందని విమర్శలు వినిపిస్తున్నాయి . టిడ్కో గ్రుహాల యందు గ్రుహప్రవేశాలు చేసారు ఇంత వరకు చేరేందుకు ముందుకు రావడం లేదని దానికి కారణం కనీస మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైనారని




విమర్శలు వినిపిస్తున్నాయి. నూనెపల్లె లో వక్స్ బోర్డు ఆస్తి 75 ఎకరాలలో దాదాపు 48 ఎకరాలలో బహుళ అంతస్తుల నిర్మాణాలు జరిగాయి. వాటిని అరికట్టేందుకు రాజకీయ నాయకులు అధికారులు ఎలాంటి ప్రయత్నాలు చేయలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దాదాపుగా 1500 బిల్డింగ్ లు నిర్మాణాలు జరిగాయని వాటిపై ఇంతవరకు ఎలాంటి వివిధ రకాల పన్నులు వసూలు చేయలేదని మున్సిపాల్టీ కి రావలసిన వివిధ రకాల పన్నుల రూపంలో వచ్చే రాబడి భారీగా కోల్పోయిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి .. రోడ్డు విస్తరణ పనులు గతంలో కొన్ని చోట్ల జరిగాయి తప్ప కొత్తగా రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం కాలేదని . ట్రాఫిక్ తో ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు . నంద్యాల జిల్లా అయిన తర్వాత పట్టణంలో దాదాపు 15 చివారు కాలనీలు వెలిశాయి. వాటికి కనీసం రోడ్డు. మంచి నీరు డ్రైనేజీ పనులపై అధికారులు ఇంతవరకు ఎలాంటి దృష్టి పెట్ట లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అమృత పదకం ఆటకెక్కిందని నంద్యాల నీటి సమస్య తో రాబోయే రోజుల్లో మరింత ఇబ్బందులు పడవలసి వస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు .

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190